క్లుప్తంగా

కేటీదొడ్డిలో భారీ వర్షం



కేటీదొడ్డి: మండలంలోని మంగళవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటల నుంచి 6 వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సీడ్‌పత్తి సాగుకు ముసురు వర్షం ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు.

విద్యార్థులకు అభినందన



అయిజ: పాలమూరు యూనివర్సిటీలో ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాన్య మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చక్రవర్ధన్ రెడ్డి అండర్‌- 18 విభాగంలో లాంగ్‌జంప్ మెదటి స్థానం, కృష్ణవేణి షాట్‌పుట్‌లో అండర్‌- 16 విభాగంలో మెదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అదే విధంగా రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మానవపాడు: పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకున్న ఘటన మండల పరిధిలోని అమరవాయిలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపిన కథనం ప్రకారం.. గ్రామంలోని సుబాబుల్ తోటలో పేకాట స్థావరంపై దాడి చేసి రూ.8,770 నగదు, 52 పత్తాలు జప్తు చేశామన్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్కాలర్‌షిప్ అందజేత



మానవపాడు: బయోస్టార్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంపెనీ రీజనల్ మేనేజర్ వరప్రసాద్‌రావు, సేల్స్ అధికారి సురేష్, డిస్ట్రిబ్యూషన్ విక్రమసింహారెడ్డి స్కాలర్‌షిప్ అందజేశారు. ఈ సందర్భంగా వారు రూ.2,500 చొప్పున 10 మంది 9వ తరగతి విద్యార్థులకు అందించారు. ప్రతి ఏటా రూ.25 వేలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మద్దిలేటి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మన్న, రియాజ్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రక్కును ఢీకొట్టిన బొలెరో వాహనం

– ఇద్దరికి గాయాలు



అలంపూర్: అలంపూర్ చౌరస్తా సమీపంలో ఫ్లైఓవర్ దిగే ప్రదేశంలో ముందు వెళ్తున్న ట్రక్కును బొలెరో వాహనం ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఉండవెల్లి ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ట్రక్కును అలంపూర్ చౌరస్తా సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొట్టినట్లు తెలిపారు. ప్రమాదంలో బొలెరో డ్రైవర్ హనుమంతప్ప, క్లీనర్ కంగాలిక్‌కు గాయాలైనట్లు తెలిపారు. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత



ధరూరు: బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్ అన్నారు. బాలల పరి రక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని గుడ్డెదొడ్డిలో స్త్రీ,శిశు సంక్షేమ బాలల పరిరక్షణ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, వేధింపులపై వివరించారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి శరణ్య, కార్యదర్శి రమేష్, నవీన్, నిర్మల, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్లతో పౌష్టికాహారం

- నిత్యం తాజా కూరగాయలు, ఆకుకూరలు
- ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఉపాధ్యాయులు
- ఏజెన్సీలకు తప్పనున్న ఆర్థిక భారం



కంచుపాడులో పాఠశాలలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్

ఉండవెల్లి: విద్యార్థులకు తాజా కూరగాయాలతో పోషకాహారం అందించడంతో పాటు సాగు పాఠాలు బోధించాలనే ఉద్దేశంతో విద్యా శాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ల ఏర్పాటుకు శ్రీకారం చేపట్టారు. పాఠశాలలోని ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన గార్డెన్లలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు రసాయనాలు లేకుండా పండిస్తున్నారు. దీంతో విద్యార్థులకు పంటల సాగుపై అవగాహనతో పాటు తాజా కూరగాయాలతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు ఉపాధ్యాయులు పేరపేర్కొంటున్నారు.

11 పాఠశాలలో..

మండలంలో 22 ప్రభుత్వ పాఠశాలలుండగా 11 పాఠశాలలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేశారు. మండలంలోని తక్కశీల, బైరాపురం, బస్వాపురం, శేరుపల్లే, ఉండవెల్లి(పీఎస్), కంచుపాడు, మారమునగాల–2, పుల్లూరు, బొంకూరు, మెన్నిపాడు, ఇటిక్యాలపాడు, ప్రాగటూరు, గ్రామాల్లోని పాఠశాలలో కిచెన్ గార్డెన్లు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

సేంద్రియ సాగు

కిచెన్ గార్డెన్‌లో ఆకు కూరలతో పాటు తీగ జాతికి చెందిన చిక్కుడు, కాకర, పంటలను సాగు చేస్తున్నారు. కూరగాయాల వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు వర్మీ కంపోస్టు ఏర్పాటు చేశారు. వర్మీ కంపోస్టులో తయారైన ఎరువును కూరగాయాల తోటకు అందిస్తుడటంతో దిగుబడులు కూడా బాగానే వస్తున్నట్లు మధ్యాహ్న భోజన నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కూరగాయల సాగులో కోతుల, జంతువుల బెడద ఉంటున్నట్లు తెలిపారు. రక్షణ కల్పించేందుకు ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. పలు పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలనే ఆదేశాలున్నా స్థలం కొరత కారణంగా ఏర్పాటు చేయలేదు.



పుల్లూరులో తోటకు నీరు పడుతున్న విద్యార్థులు

సాగుపై అవగాహన



పాఠశాల్లో కిచెన్ గార్డెన్ల నిర్వహణతో చాల ప్రయోజనాలు ఉన్నాయి. విద్యార్థులకు కూరగాయాల సాగుపై అవగాహన కలుగుతుంది. వర్మీ కంపోస్టు ఎరువును మొక్కలకు అందిస్తుండడంతో దిగుబడినిస్తున్నాయి. తాజా కూరగాయాలతో ఆరోగ్యకరమైన ఆహారం విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రామకృష్ణ, ఎంఈఓ, ఉండవెల్లి

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

ధరూరు: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు అరుకుందమ్మ, లలితమ్మలు మాట్లాడారు. గతనెల వేతనాలు ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు వేతనాలను పెంచడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'కాంగ్రెస్‌ది దుర్మార్గపు పాలన'



అయిజ: కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన చేస్తుందని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. రైతులకు యూరియా సరఫరా చేయడంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఘోరంగా విఫలమయ్యిందన్నారు. పదేళ్లపాటు బీఆర్‌ఎస్ పార్టీ పాలనలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా వ్యవసాయం చేసిన రైతులు ఇప్పుడు కాంగ్రెస్ నాయకుల పాలనలో ఆకలిదప్పులతో క్యూలో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, వెంకటేష్, ముద్దన్నగౌడ్, మహేష్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ వితరణ

శాంతినగర్: వడ్డేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను శాంతినగర్ చెందిన ఎన్‌ఆర్‌ఐ పాట్లూరి రవి అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఆక్సిజన్ కొరత లేకుండా చూడాలనే సంకల్పంతో ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాను ప్రారంభించండి



శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్‌లో నిర్మిస్తున్న పల్లెదవాఖానా పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ లక్ష్మణ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, విషజ్వరాలతో ప్రజలు మంచం పడుతున్నారన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మానవపాడు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ రాఘవ సూచించారు. మంగళవారం మండలంలోని గోకులపాడు ప్రాథమిక పాఠశాలను, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. అదే విధంగా పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్రమణేశ్వరరెడ్డి, సీసీ బాష, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం



అయిజలో స్వదేశీ వస్తువుల గురించి వివరిస్తున్న భగత్‌రెడ్డి

అయిజ: ఆత్మ నిర్భర్ భారత్ కోసం స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిద్దామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రజలకు స్వదేశీ వస్తువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భగత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పుల దృష్ట్యా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆత్మ నిర్భర్ భారత్ అత్యంత అవసరమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, లక్ష్మణ్‌గౌడ్, వెంకట రాముడు, మాధవాచారి, కృష్ణ, నరసింహులు, రఘు తదితరులు పాల్గొన్నారు.

సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: పాఠశాలలో ప్రతి అంశానికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో పొందు పర్చాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో హెచ్‌ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సంబంధించిన యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా ఎఫ్‌ఎల్‌ఎన్, ఎఫ్‌ఆర్‌ఎస్ ఆన్‌లైన్ ఎంట్రీలు ఖచ్చితంగా 100 శాతం చేయాలన్నారు. మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చదువు లో వెనుకబడిన, బడికి రాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారిని బడికి వచ్చేలా చూడడంతో పాటు పిల్లల ప్రగతిని వివరించాలని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, విజయశివకుమార్, సాయన్న, సీఆర్‌పీ నర్సింహులు పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేయాలి

గట్టు: యూడైస్ ఫాంలో విద్యార్థుల సమగ్ర వివరాలు నమోదు చేయాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఎఫ్‌ఎల్‌ఎన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలన్నారు. యూడైస్ ప్లస్ ప్రొఫైల్‌కు సంబంధించిన సమగ్ర వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఎల్‌బీపీ విధానంలో 6, 7, 8 తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు మోహన్‌రెడ్డి, నర్సింహులుగౌడ్, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

మల్దకల్: విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యనను అందించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేష్, రమేష్, సీఆర్పీలు పరమన్న, పద్మ, వెంకటేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మహిళపై దాడి

గద్వాల క్రైం: మహిళపై దాడి చేసిన ఘటన మంగళవారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. న్యూ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కుర్వ సుధాకు అదే కాలనీకి చెందిన వారితో వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమెపై కొందరు దాడి చేశారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు సుధా పేర్కొన్నారు.

ఘనంగా మదర్ థెరీసా జయంతి



గద్వాలన్యూటౌన్: ప్రేమ, దయ, సేవకు ప్రతీకగా నిలిచిన నోబెల్ శాంతి పురస్కార గ్రహీత మదర్ థెరీసా 115వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంధుల ఆశ్రమ పాఠశాలలో వేదవ్యాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగన్న, అశోక్‌కుమార్, రాములు, జాన్, చక్రి నర్సింహులు, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీచుపల్లిలో నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

ఎర్రవల్లి: మండల పరిధిలోని బీచుపల్లి కృష్ణానది పుష్కరఘాట్‌ను మంగళవారం ఇటిక్యాల ఎస్‌ఐ రవినాయక్ వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. ఘాట్‌కు వెళ్లే రోడ్లు, బారికేడ్లు, లైటింగ్, పార్కింగ్ వసతులు పరిశీలించారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నిమజ్జనం నిమిత్తం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లును పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నల్లారెడ్డి

గట్టు: బీజేపీ జిల్లా నూతన కార్యవర్గంలో మండలంలోని బల్గెర గ్రామానికి చెందిన నల్లారెడ్డికి చోటు కల్పించడంపై మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్లారెడ్డితో పాటు గూడురు నాగప్ప తదితర నాయకులు మంగళవారం పార్టీ యువ నాయకురాలు స్నిగ్ధారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు కలసి కృతజ్ఞతలు తెలియజేశారు.

పట్టుబడిన ఇసుక లారీ

అలంపూర్: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీ పట్టుకున్నట్లు ఉండవెల్లి ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా బ్లూకోర్టు పోలీసులు మంజునాథ్‌నాయుడు, ఖాదర్‌పాష మంగళవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. ఓర్వకల్ మండలానికి చెందిన లారీ డ్రైవర్ రాజశేఖర్ తాడిపత్రిలో ఇసుక నింపుకొని హైదరాబాదుకు తరలిస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



కొలువుదీరనున్న బొజ్జ గణపయ్యలు



మల్దకల్‌లో మట్టి వినాయకుల తయారీపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

- మండపాలకు తరలిన గణనాథులు
- నందడిగా మారిన గ్రామాలు

అలంపూర్: వినాయకచవితిని పురస్కరించుకొని బొజ్జగణపయ్యలు వాడవాడలా కొలువుదీరనున్నారు. బుధవారం గణనాథుడు కొలువుదీరనుండటంతో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో మండపాలను మంగళవారం సిద్ధం చేశారు. మండపాలను విద్యుత్ దీపాలు, రంగు రంగుల కాగితాలతో ముస్తాబు చేశారు. ఈ నేపథ్యంలో పట్టణాలు, గ్రామాల్లో పండుగ వాతవరణం నెలకొంది.

గణపయ్యల పంపిణీ

మున్సిపాలిటీలో స్వామి వివేకానందా యూత్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను విగ్రహాల దాత ఏజీ జితేందర్‌గౌడ్ అందజేశారు. పదిహేను సంవత్సరాలుగా యూత్ ఆధ్వర్యంలో అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ అధ్యక్షుడు బుజ్జియాదవ్, కామాక్షి, సంజీవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజించాలి

మల్దకల్: పర్యావరణ హితమైన మట్టి వినాయకులనే పూజించాలని హెచ్‌ఎం నరేష్ విద్యార్థులకు సూచించారు. అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు మట్టి గణపతుల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను తయారుచేసుకొని పూజించాలన్నారు. అదే విధంగా మల్దకల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో మట్టి వినాయకుల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విష్ణు, అర్షిత్, సుమలత, అనిత, ఋషిరాజు, ధనుంజయ, ఆనంద్, సరిత, రవి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతుల వితరణ

అయిజ: అంకుర సంస్థ శ్రీజ గ్రీన్ గెలాక్సీ సంస్థ వేరుశనగ పొట్టుతో తయారు చేసిన మట్టి గణపతుల విగ్రహాలను మండల కేంద్రంలోని ఓ పాఠశాలలో విద్యార్థులకు అందజేశారు.

ఆకట్టుకున్న గణపయ్య ఆకృతి

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాలలో మంగళవారం ముందస్తుగా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వినూత్నంగా బొజ్జ గణపయ్య ఆకృతిలో విద్యార్థులు కూర్చొని అబ్బురపరిచారు. పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా పండుగ జరుపుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎర్రవల్లిలో వినాయకుడి ఆకృతిని ప్రదర్శిస్తున్న విద్యార్థులు



అయిజలో మట్టి గణపతి విగ్రహాలతో విద్యార్థినులు



అలంపూర్‌లో మట్టి గణపయ్యలను అందజేస్తున్న దాత జితేందర్‌గౌడ్



అలంపూర్ చౌరస్తా వద్ద తరలివెళ్తున్న గణనాథుడు

విషజ్వరాలతో గురుకుల విద్యార్థులు

- మూడు రోజుల్లో 20 మందికి చికిత్స

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు విషజ్వరాల బారినపడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం గురుకుల పాఠశాలకు చేరుకొని వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. గురుకులంలో 560 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా 20 మంది వరకు విషజ్వరాల బారినపడినట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థులకు స్థానిక వంద పడకల ఆస్పత్రిలో చేర్పించారు. మరికొంత మందికి పాఠశాలలోని ప్రత్యేక గదిలో చికిత్స అందిస్తున్నారు. పాఠశాలలో ఎలుకల బెడద అధికంగా ఉందని ఎలుకలు కరవడంతో గాయాలైనట్లు సోషల్ మీడియాలో వైరలైంది. ఈ విషయమై ప్రిన్సిపాల్ రామకృష్ణను సంప్రదించగా అలాంటి ఏమి లేదన్నారు. ఎలుకులు సంచరిస్తుండటంతో ర్యాట్ ప్యాడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జ్వరం బారిన పడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.



జ్వరంతో పడుకున్న విద్యార్థులు

చదరంగంతో ఏకాగ్రత మెరుగు

శాంతినగర్: విద్యార్థులు చదరంగంపై అవగాహన పెంచుకుంటే ఏకాగ్రత మెరుగవుతుందని ఎన్‌ఆర్‌ఐలు పాట్లూరి రవి, రవికుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఐ ఫోరం ఆధ్వర్యంలో చెస్ బోర్డులు పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో మండల, జిల్లాస్థాయి చెస్ పోటీలను పాలమూరు ఎన్‌ఆర్‌ఐ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహ, ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, రాజశేఖర్, రవికుమార్, సూరి తదితరులు పాల్గొన్నారు.

చెస్ బోర్డుల పంపిణీ

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాలమూరు ఎన్‌ఆర్‌ఐ ఫోరం ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధి రవిప్రకాష్ రెడ్డి విద్యార్థులకు చెస్ బోర్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హేమలత, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో చెస్ బోర్డులు అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐలు

ఉత్సాహంగా టీఎల్‌ఎం మేళా

ఎర్రవల్లి: మండల పరిధిలోని కొండేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఈఓ అమీర్‌పాష ఆధ్వర్యంలో మండలస్థాయి ఎఫ్‌ఎల్‌ఎన్‌- టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లాస్థాయి సెక్టోరియల్ అధికారి ఎస్తేర్ రాణి, తహసీల్దార్ నరేష్ హాజరై రిబ్బన్ కట్ చేసి కార్యక్రమం ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు, ఆంగ్లం, గణితం, ఈవీఎస్ విభాగాల్లో ప్రతిభను కనబర్చారు. అనంతరం వారు మాట్లాడుతూ టీఎల్‌ఎం మేళాతో విద్యార్థులకు విద్యా బోధన సులవు అవుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వరద సుందర్‌రెడ్డి, శివశంకర్ ప్రసాద్, హనుమంతు, నారాయణచారి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టీఎల్‌ఎంను ప్రారంభిస్తున్న అధికారులు

టీబీ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు

గట్టు: టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టీబీ ప్రోగ్రాం అధికారి రాజు ఆధ్వర్యంలో వైద్యాధికారి రమేష్ టీబీ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో కలసి టీబీవ్యాధిపై పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా టీబీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాదిక్, టీబీ సూపర్‌వైజర్ సోమశేఖర్, ఎస్‌టీఎస్‌ఎస్ నరేంద్ర, ఏఎన్‌ఎం పార్వతి, తాహెరా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్యాధికారులు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల | కె.వీరాంజనేయుడు | - | 9642913894
అలంపూర్/అయిజ | ఎన్.గోవర్ధన్ | - | 9948797122
టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

జబ్బార్ లాల్ : 9553955603